MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments

Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595


క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
మంగళవారం 12-5-2026 పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# అంతా మా ఇష్టం

- బడంగ్‌పేటలో ఆగని అక్రమాలు
- ఏసీబీ, విజిలెన్స్ విచారణలున్నా అదే పంథా
- స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి ఒత్తిళ్లు
- చక్రం తిప్పుతున్న కంప్యూటర్ ఆపరేటర్, బంధువైన కాంట్రాక్టర్

**జీహెచ్ఎంసీ పరిధిలోని బడంగ్‌పేట మున్సిపల్ కార్యాలయంలో అవినీతి అక్రమాల పర్వం కొనసాగుతూనే ఉంది. కోట్లాది రూపాయల నిధుల గోల్ మాల్‌పై ఒకవైపు ఏసీబీ, మరోవైపు విజిలెన్స్ విచారణలు ముమ్మరంగా సాగుతున్నా, కొందరు అధికారులు మాత్రం తమ పంథా మార్చుకోవడం లేదు. ఏసీబీ కన్ను పడినా.. విజిలెన్స్ వేటు వేసినా.. మా లెక మాదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పాత బిల్లుల క్లియరెన్స్ కోసం కాంట్రాక్టర్లతో కుమ్మకై అడ్డదారులు తొకుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):




బిల్లులు రావాల్సిన కాంట్రాక్టర్లలో 28 మంది స్థానిక నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ నేతను కలిసి అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు, సమగ్ర విచారణ జరిపితే అసలుకే టెండర్, పనులు తాలుకా అసలు వివరాల గుట్టు తేలితే బిల్లులు రావడం కష్టమేనని భావించిన సదరు కాంట్రాక్టర్లు పైరవీలకు తెరలేపారు. అధికారులు మాత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ విషయంలో ప్రత్యేక ఫార్మట్ ఇచ్చారని, టెండర్ ఐడీ, డేటా, పనులు వివరాలు, ఏ స్టేజీలో ఎంత చేశారు? ఇలా దాదాపు 18 కాలమ్స్‌తో కూడిన వివరాలను పూర్తిగా తీసుకుని బిల్లులు రికార్డు చేస్తున్నట్లు చెబుతున్నారు. మొత్తంగా ఈ వారంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి బిల్లుల చెల్లింపుల ప్రతిపాదనలు చేరనున్న తరుణంలో గుట్టు చప్పుడు కాకుండా కొందరు కాంట్రాక్టర్లతో కలిసి భారీ ఎత్తున ఆక్రమాలకు పాల్పడుతున్నట్లు ఉద్యోగుల్లో చర్చ జరుగుతున్నది.

మిగతా 2లో

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి...
- ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతులను కల్పించాలి...
- ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి...
- యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

8లో

## ఇండ్ల గణన కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలి.

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- జన గణన 2027లో భాగంగా మే 11 నుండి జూన్ 9 వరకు తొలి దశ “ఇండ్ల గణన” నిర్వహణ
- ప్రతి ఇంటికి ఎన్యుమరేటర్లు వచ్చి కుటుంబ వివరాలు సేకరణ
- ప్రజలు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుంది
- ప్రభుత్వ పథకాలు కోల్పోతామనే అపోహలు అవసరం లేదు

7లో

# అంతా మా ఇష్టం

బడంగ్ పేటలో సుమారు రూ. 122 కోట్ల పనుల్లో అక్రమాలు జరిగాయన్న విజిలెన్స్ నివేదిక ఆధారంగా జీహెచ్ఎంసీ కమిషనర్ 10 మంది అధికారులపై సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. విలీనానికి ముందు జరిగిన పనుల్లో రికార్డుల తారుమారు, కమీషన్ల పంపకాలపై లోతైన విచారణ జరపడం, మరోవైపు ఏసీబీ అధికారులు ఒక్కో అధికారికి పిలిచి విచారణ చేస్తున్నారు. ఈ సమయంలోనే రాష్ట్ర విజిలెన్స్ విభాగం సైతం అన్ని రికార్డులను జిరాక్స్ రూపంలో తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలోనే అదృశ్యమైన 46 కీలక ఫైళ్లు ఓ కాంట్రాక్టర్ బంధువు ఇంట్లో ప్రత్యక్షం కావడం, ఇప్పుడు ఆ ఫైళ్ల వెనుక ఉన్న అసలు తిమింగలాలను కాపాడేందుకు తెరవెనుక భారీ పైరవీలు సాగుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. మరికొందరు ఈ గందరగోళాన్ని ఆసరాగా చేసుకుని మరికొన్ని పాత బిల్లులను వెనకదారిలో పాస్ చేయించుకునేందుకు కొందరు కాంట్రాక్టర్లు పావులు కదుపుతున్నట్లు తెలుస్తున్నది. ప్రధానంగా కార్యాలయంలో ఓ ఔట్సోర్సింగ్ ఉద్యోగి అయిన కంప్యూటర్ ఆపరేటర్‌ను మధ్య వర్తిగా పెట్టుకుని ఈ మంత్రాంగం నడిపిస్తున్నారన్న ప్రచారం ఉంది. ప్రక్షాళనలో భాగంగా అటెండర్ నుంచి ఉన్నతాధికారుల వరకు సమూలంగా మార్పులు చేసిన అధికారులు...ఓ ఆపరేటర్‌ను మాత్రం తిరిగి అదే స్థానంలో విధులు కొనసాగిస్తుండడం, గతంలో మాదిరిగానే ఇంజినీరింగ్ వ్యవహారాలను తన చేతుల్లో పెట్టడమే ఇందుకు నిదర్శమని చెబుతున్నారు. సదరు ఆపరేటర్‌కు వరుసగా బావ కూడా కాంట్రాక్టర్ కావడం, అధికారులకు, కాంట్రాక్టర్ల మధ్య వారధిగా ఉంటూ పాత బిల్లుల క్లియరెన్స్, విచారణలో ఏ అంశాలు బయటకు రాకుండా వ్యవహారాలను చక్కబెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా లక్ష రూపాయల లోపు ఉన్న దాదాపు 1200 ఫైల్స్ జోలికి వెళ్లకుండా రూ.కోట్లలో ఉన్న టెండర్ తాలుకా బిల్లులు చెల్లింపులపై జీహెచ్ఎంసీ కమిషనర్ జోక్యం చేసుకుని అక్రమార్కుల భరతం పట్టాలని కోరుతున్నారు.



## ఎస్ఎన్‌డీపీ నాలా పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్)** మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి జిల్లేలగూడ డివిజన్ పరిధిలోని మిథుల నగర్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన ఎస్ఎన్‌డీపీ నాలా పనులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలా పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎక్కడా అలసత్వం ప్రదర్శించకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్కల భూపాల్ రెడ్డి, దిప్లాల్ చౌహాన్, అర్కల కామేష్ రెడ్డి, మదారి రమేష్, అనిల్ కుమార్ యాదవ్, విజయ్, దిండు భూపేష్ గౌడ్, లక్ష్మణ్ ముదిరాజ్, గోపి యాదవ్, సునీత బాలరాజ్, సుర్వి లత, పంతంగి మాధవి, బిందు, నిర్మల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జనగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

-స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**యాదాద్రి జిల్లా,మే 11, క్రైమ్ మిర్రర్ :** జనగణన--2027 తొలి దశలో భాగంగా నిర్వహిస్తున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులకు సూచించారు. సోమవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న హౌస్ లిస్టింగ్ గణన ప్రక్రియను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. హౌస్ లిస్టింగ్ ఆపరేషన్‌లో ప్రతి ఇంటిని తప్పనిసరిగా కవర్ చేయాలని పేర్కొన్నారు. ఏ ఒక్క కుటుంబం లేదా గృహం గణనలో వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎన్నుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు.ప్రతి ఎన్యూమరేటర్ తనకు కేటాయించిన పరిధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అవసరమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. గణనలో నమోదు చేసే వివరాలు భవిష్యత్తు ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు.అధికారులు సమన్వయంతో పనిచేసి గణన ప్రక్రియను సమయానికి పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గ్రేటర్ 38.7 డిగ్రీలు

ద్రోణి ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38.7డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25.2డిగ్రీలు, గాలిలో తేమ 32శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రెండు రోజులతో పోల్చితే నగరంలో కొంత వేడి తీవ్రత ఎక్కువగా ఉందని, మరో రెండు రోజుల వరకు ఇదే తీరుగా వాతావరణం ఉంటుందని అంచనా వేశారు.



# అవుటర్‌రింగ్‌రోడ్డుపై ఆంక్షలను పట్టించుకోని వాహనదారులు

అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)పై ఉన్న ఆంక్షలను వాహన దారులు లెక్కచేయకపోవటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఓఆర్ఆర్‌పై ఏ వాహనం ఏ లేన్‌లో వెళ్లాలి...ఏ వెహికిల్ ఎంత వేగంతో వెళ్లాలో కచ్చితమైన నిబంధన ఉన్నది. అలాగే, కార్లు వంద నుంచి 120 కిలోమీటర్ల స్పీడు.. లారీలు, భారీ వాహనాలైతే 80 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో వెళ్లాల్సి ఉంటుంది. కానీ చాలామంది తమకు కేటాయించిన లేన్లలో వెళ్లకుండా గీత దాటి మరో వరుసలోకి వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఓఆర్ఆర్‌పై వాహనాలను నిలపొద్దని నిబంధన ఉన్నా.. కొందరు వెహికిల్స్ నిలపడం.. అది గమనించక వాహనదారులు అతివేగంగా వచ్చి ఆగి ఉన్న వాహనాలను ఢీకొని దుర్మరణం పాలవుతున్నారు. ముఖ్యంగా అవుటర్‌రింగ్ రోడ్డుపై ఒకవైపు నాలుగు లేన్ల వరుసలున్నాయి. నిబంధనల ప్రకారం ఒకటి, రెండు లేన్లలో కార్లు, మూడు, నాలుగు వరుసల్లో లారీలు, ఇతర భారీ వాహనాలు మాత్రమే ప్రయాణించాలి. కానీ, ఈ నిబంధనలు అతిక్రమిస్తున్న క్రమంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పదుల సంఖ్యలో ప్రజలు మృత్యువాతపడ్డారు. దీనికి తోడు అతివేగం, నిర్లక్ష్యంగా వాహ నాలను నడపటం కూడా



యాక్సిడెంట్లకు కారణమని పోలీసులు పేర్కొంటున్నారు. కాగా, ఎగ్జిట్ నంబర్ 12 నుంచి 16 వరకు బొంగుళూరు నుంచి శంషాబాద్‌ల మధ్య ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. గత వారం రోజుల్లో పదిమంది వరకు మృత్యువాతపడ్డారు. అయినప్పటికీ అధికారులు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవటం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం నూతన కమిటీ



**క్రైమ్ మిర్రర్, పెగడపల్లి:** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నంచర్ల గ్రామంలోని అపర భద్రాద్రిగా పేరుపొందిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయపు నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించడం జరిగింది. దేవస్థానం గౌరవ అధ్యక్షులుగా కుంటాల వనజ శ్రీనివాస్, అధ్యక్షుడిగా గోలి జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మ్యాకల మల్లేశం, ఉపాధ్యక్షులుగా కుంటాల లక్ష్మి రాజం, కట్ల శ్రీనివాస్, బొడ్డు మధుకర్, కోశాధికారిగా పోడేటి గంగాధర్, సహాయ కోశాధికారిగా ఎడ్ల రవీందర్ రెడ్డి, ప్రచార కార్యదర్శిగా రంగు ప్రభాకర్, జాయింట్ సెక్రటరీగా ఉప్పుల రవీందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రాజు అశోక్, సిద్దెంకి సుమలత, చెవుల శ్రీలత, ఎనగందుల సతీష్, కార్యవర్గ సభ్యులుగా దండు గంగయ్య, కుంటాల బాబు, దీకొండ దుర్గయ్య, పూదరి రాజశేఖర్, దంతర వేని మధుకర్, భూసర్థి కవిత, తాళ్లపల్లి రమేష్, గుండారపు భీమయ్య, క్యాస రమేష్ బాధ్యతలు స్వీకరించారు.

# గొల్లపల్లి మోడల్ స్కూల్‌లో ఘనంగా ఉచిత సమ్మర్ క్యాంప్ ప్రారంభం...!

**జగిత్యాల జిల్లా బ్యూరో(క్రైమ్ మిర్రర్)** గొల్లపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 15 రోజుల పాటు నిర్వహించనున్న ఉచిత సమ్మర్ క్యాంపును సోమవారం స్థానిక సర్పంచ్ (ప్రథమ పౌరురాలు) నల్ల నీరజ సతీష్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుచ్చి రెడ్డి, మండల విద్యాధికారి (వీజూా) చెరుకు రాజన్న, మరియు పాఠశాల ప్రిన్సిపాల్ రవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సమ్మర్ క్యాంప్ నేటి నుండి 15 రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగుతుంది. మండలంలోని 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. సెలవుల్లో విద్యార్థులు కేవలం ఇళ్లకే పరిమితమై సెల్ ఫోన్లు, టీవీలకు బానిస (ూ౧ఎఅఖ్) కాకుండా, వివిధ సృజనాత్మక కార్యక్రమాల ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవడం. ఈ సందర్భంగా ఎంఈఓ రాజన్న మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఇటువంటి శిబిరాల్లో పాల్గొని తమలోని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని కోరారు. స్కూల్ నిర్వహించే వివిధ కార్యక్రమాల ద్వారా కొత్త విషయాలను నేర్చుకోవాలని వారు విద్యార్థులకు సూచించారు.



# కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కల్తీపాల కలకలం...!

- దాసర్ల పల్లిలో యాదవ్ డైరీ మిల్క్ పాల బూతులో కల్తీపాల వ్యాపారం...!
- పసిపిల్లలు తాగే పాలను కల్తీ చేస్తున్న కేటుగాళ్లు...!
- నిల్వ చేసిన 80 లీటర్ల కల్తీ పాలను స్వాధీనం చేసుకున్న ఎస్ ఓ టి పోలీసులు
- కల్తీ పాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవు సిఐ వెంకటేశ్వర్లు

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** పసిపిల్లలు త్రాగే పాలతో వ్యాపారం చేస్తూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నాడు. ఓ ప్రబుద్ధుడు. వివరాల్లోకి వెళితే కందుకూరు మండలంలోని దాసర్లపల్లి గ్రామంలో ఉన్న యాదవ డైరీ మిల్క్ బూత్‌లో పాలను కల్తీ చేస్తున్నారనే విశ్వాస నీయ సమాచారం అందడంతో, పోలీసులు వెంటనే అక్కడికి వెళ్ళి మిల్క్ బుత్‌లో సోదా నిర్వహించగా అందులో మారమోని శ్రీశైలం అనే వ్యక్తి బూతులో తనిఖీ చేయగా ఒక కెమికల్ బాటిల్ కనిపించడంతో, ఇదేమిటి అని అడగగా హైడ్రోజన్ పెరాక్సైడ్ అని సమాధానమిచ్చాడు. ఇది దేనికి ఉపయోగిస్తారు అని ప్రశ్నించగా.., పాలు చెడిపోకుండా ఉండటానికి అని పొంతనలేని సమాధానమిచ్చాడు..అదే భూతులో సుమారు 80 లీటర్ల పాలు గుర్తించిన పోలీసులు.ఆ పాలలో కెమికల్ కలిపినావా అని ప్రశ్నించగా కలిపినాను అని తెలిపదాంతో. వెంటనే ఆవ్యక్తిని అదుపులోకి తీసుకొని పూర్తి వివరాలు అడగగా, అతను చుట్టుపక్కల రైతుల వద్ద రాత్రివేళ పాలను కొనుగోలు చేసి, వాటిని తర్వాత రోజు ఉదయాన్నే హైదరాబాద్‌కు తీసుకెళ్లి హోటళ్లలో విక్రయిస్తున్నానని తెలిపినాడు. రాత్రి సమయంలో ఫ్రిడ్జ్ లో నిలువ చేస్తే విద్యుత్ ఛార్జీలు ఎక్కువ అవుతుందని, దాని వల్ల నెలకి దాదాపు 7,000 నుండి 8,000 వరకి కరెంట్ బిల్ వస్తుంది అని, అదే సమయంలో కెమికల్ లీటర్ బాటిల్ 150/- దొరుకుతుండటంతో, దానిని ఉపయోగించటం వలన పాలు ఎక్కువ కాలం నిలువ ఉండటంతో పాటు ఖర్చు కూడా తక్కువ అవుతుంది అని భావించి, పాలను ఉదయం వరకు







నిల్వ ఉంచేందుకు ప్రజల ఆరోగ్యానికి హానికరమని తెలిసినా హైడ్రోజన్ పెరాక్సైడ్ కలిపి పాలను కల్తీ చేసి, వాటిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి హోటళ్లలో విక్రయిస్తున్నానని స్వచ్ఛందంగా తన నేరాన్ని ఒప్పుకున్నాడు. దాంతో షాపులో అమ్మకానికి నిల్వ ఉంచిన 80 లీటర్ల పాలు ఉన్న మూడు పాల క్యాన్‌లు మరియు 300 ఎశ్రీ ఎఎతీశీస్త్రవఅ ్రావతీశీ×ఱఎవ కలిగిన డబ్బాను స్వాధీనం చేసుకొని, నిందితుడు మారమోని శ్రీశైలం యొక్క నేర ఒప్పుకోవడంతో అదుపులో తీసుకున్నారు. చట్టపరమైన చర్యగా,కేసు నమోదు చేసి, దర్యాప్తు కోనసాగిస్తున్నాము అని ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే కల్తీ పలు ప్రజల ఆరోగ్యానికి చాలా హానికరము. అలాగే ప్రజల ఆరోగ్యానికి హానికరమైన, నిషేధించబడిన పదార్థాలను ఎవరైనా విక్రయించినా వారి పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 11:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.దఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సంగారెడ్డి పట్టణంలోని పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ తెరిచి ఉండటం ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రమాదాలు జరగకముందే వాటిని పరిశీలించి వెంటనే మూసివేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. అలాగే ఆర్ అండ్ బి రోడ్ల డివైడర్లపై ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద ఫ్లెక్సీలు, పాత ఫ్లెక్సీలను తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సింగూర్ డ్యాం వద్ద బారికేడ్లు, హెచ్చరిక సైన్ బోర్డులు లేవని తన దృష్టికి వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రమాదాలు నివారించేందుకు వెంటనే బారికేడ్లు, సైన్ బోర్డులు



ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను 30 రోజులలోపు పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 108 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 23, సంగారెడ్డి డివిజన్‌కు 27, ఆందోల్ డివిజన్‌కు 03, నారాయణఖేడ్ డివిజన్‌కు 27, జహీరాబాద్ డివిజన్‌కు 29 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 11:** కమిషనర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా విద్యార్థుల కోసం ప్రభుత్వ ఐటీఐల్లో 202627 విద్యా సంవత్సరానికి ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడ్లలో ప్రవేశాలకు దరఖాస్తులను ఈ నెల 14వ తేదీ నుండి జూన్ 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.దరఖాస్తుల వివరాలకు సంబంధించి సమీప ప్రభుత్వ ఐటీఐలను సంప్రదించాలని ప్రిన్సిపల్ తెలిపారు.



# సృష్టికి మూలం అమ్మ

**తల్లి ప్రేమను వెలకట్టలేం..!**

**ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి):** సృష్టికి మూలం అమ్మ అని.. కోటి జన్మలెత్తిన తీర్చలేనిది అమ్మ ప్రేమ అని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ చెప్పారు. రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండల కేంద్రం సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నాడు అమ్మ పాదపూజ ఆశీర్వచనం కార్యక్రమంను ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులు తరలివచ్చి వారి తల్లిదండ్రులకు పాదపూజ చేసి ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో సుమారు 1250 మంది తల్లులు, పిల్లలు పాల్గొన్నారు. ఆశీర్వచనం ఇచ్చిన తల్లులకు ఉప్పల వెంకటేష్ చీరలను అందచేశారు. అనంతరం ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ.. అమ్మతనం మాటలలో వర్ణించలేనిది, అక్షరాల్లో రాయలేనిదని, ఈ సృష్టిలో తీయ్యని పదం, వెలకట్టలేనిది అమ్మ ప్రేమ అని, అపూర్వమైన బంధం అమ్మ అని పేర్కొన్నారు. ఈ జన్మలో మనం చూసే, ఆస్వాదించే ప్రతీ క్షణం మన మాతృమూర్తి అయిన అమ్మ చూపే అనురాగం, ఆప్యాయత మరెవ్వరు చూపలేరనీ సాటి రారని తెలిపారు. ప్రస్తుత తరుణంలో యువత చెడు అలవాట్లకు బానిసై అమ్మతనాన్ని మరచి కొత్త పుంతలు తొక్కుతున్నారని అలాంటి వారిని ఆ దైవమే రక్షించాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శృతిలయ కల్చరర్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సూపర్లను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మంజుల, అఖిల్, అనిల్ భావన, వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# పేదల ఆత్మగౌరవానికి ప్రతీక.. ఇందిరమ్మ ఇండ్లు

**రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు కాయితి ఆశాదీప్ రెడ్డి**



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** పేదల ఆత్మగౌరవానికి ప్రత్యేక ఇందిరమ్మ ఇండ్లు అని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు తాండ్ర గ్రామ సర్పంచ్ కాయితి ఆశాదీప్ రెడ్డి అన్నారు. కల్వకుర్తి మండలం, తాండ్ర గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇంటి లబ్దిదారులు హన్మంత్ శ్రీశైలం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి కాయితి ఆశాదీప్ రెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం గృహ నిర్మాణం చేసుకున్న కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆశాదీప్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంలోనే తీరుతుందని అన్నారు. గత 10 సంవత్సరాల కాలంలో ఇల్లు లేని నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు అనుభవించారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికి రూ. 5 లక్షల సహకారంతో సొంతింటి కల సహకారం అవుతుందని తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆశాదీప్ రెడ్డి పేర్కొన్నారు.

# తారా కళాశాలలో ఘనంగా విద్యా వారోత్సవాల ప్రారంభం



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 11:** తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నేటి నుండి ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహించనున్న విద్యా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా కళాశాలలో ఇప్పటికే జాబ్ మేళా సహా పలు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యా వారోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు మరియు బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందన్నారు. ఈ ఒప్పందం ప్రకారం వచ్చే మూడు సంవత్సరాలలో కళాశాలను ప్లాస్టిక్ రహిత కళాశాలగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. బిస్లరీ సంస్థ సహకారంతో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం, వాటిని రీసైకిల్ చేసి ఉపయోగకరమైన వస్తువుల తయారీపై వాలంటీర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అదేవిధంగా కళాశాలలో నూతనంగా నిర్మించిన బీకాం, బీఎస్ఎఫ్ఐ మరియు హెచ్ఆర్ విభాగాలకు సంబంధించిన ఆరు తరగతి గదులను ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించనున్న విద్యా వారోత్సవాల కార్యక్రమానికి కళాశాల నుండి 150 మంది విద్యార్థులు, అధ్యాపకులు హాజరుకానున్నారని చెప్పారు. విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యాన్ని కల్పిస్తున్నామని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నిర్మల, డాక్టర్ జగదీశ్వర్, కామర్స్ విభాగాధిపతి జ్యోతి, డాక్టర్ రత్న ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ అధికారులు, వివిధ శాఖల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# పోక్సో కేసుపై బండి సంజయ్ రాజీనామా చేయాలి : ఆదర్శ్ రెడ్డి



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 11:** పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్నప్పటికీ కేసు నమోదై 48 గంటలు గడిచినా నిందితుడిని అరెస్ట్ చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. పోక్సో చట్టం ప్రకారం ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచాల్సి ఉండగా, పోలీసులు కావాలనే ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇవ్వడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా గంటల తరబడి వేచి ఉంచి కేవలం అక్నాలెడ్జ్‌మెంట్ ఇచ్చి పంపించడం పోలీసుల వైఫల్యానికి నిదర్శనమన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ పదవిలో కొనసాగితే కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరగదని, వెంటనే ఆయన రాజీనామా చేయాలని లేదా ప్రధాని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంపై ఒత్తిడి తీసుకువచ్చి కేసును వెనక్కి తీసుకోవాలని బెదిరింపులకు పాల్పడిన వారిని కూడా సహనిందితులుగా చేర్చాలని కోరారు. బాధిత బాలికకు, ఆమె కుటుంబానికి తక్షణ రక్షణ కల్పించి మెజిస్ట్రేట్ ముందు 164 స్టేట్‌మెంట్ నమోదు చేయాలని అన్నారు. కేసులో నిందితుడికి సులభంగా బెయిల్ వచ్చే సెక్షన్లు కాకుండా కఠినమైన పోక్సో సెక్షన్లు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఇతర ఘటనలలో కఠిన చర్యలు కోరిన బండి సంజయ్, ఇప్పుడు తన కుమారుడి విషయంలో మాత్రం మౌనం వహించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఆడబిడ్డకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తుందని ఆదర్శ్ రెడ్డి స్పష్టం చేశారు.

# అధికార మదంతో అరాచకాలా? బండి భగీరథుని వెంటనే కటకటాల్లోకి నెట్టాలి!

**బీసీ బాలికపై అఘాయిత్యం.. కేంద్ర మంత్రి అండతో పోలీసుల కాలయాపనపై బంగారు దీపక్ నిప్పులు**



**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన అధికారాన్ని, అంగబలాన్ని అడ్డం పెట్టుకొని తన కొడుకు చేసిన అకృత్యాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని కరీంనగర్ జిల్లా అంబేద్కర్ సంఘం నేత బంగారు దీపక్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక నిరుపేద బీసీ మైనర్ బాలికపై బండి సాయి భగీరథ సాగించిన అరాచకం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని ఆయన మండిపడ్డారు. అధికార గర్వం.. ధన మదం! "కేంద్ర మంత్రి పదవి ఉంది కదా అని సామాన్యులను తొక్కి పారేస్తారా?" అని దీపక్ ప్రశ్నించారు. బండి సాయి భగీరథ గత కొంతకాలంగా ఒక మైనర్ బాలికను బెదిరించి, లోబర్చుకొని వాడుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులు పోలీసులను ఆశ్రయిస్తే, కేంద్ర మంత్రి స్వయంగా రంగంలోకి దిగి మధ్యవర్తులతో రాయబారాలు నడపడం, సదరు బీసీ కుటుంబాన్ని 'నయానా భయానా' భయభ్రాంతులకు గురిచేయడం ఆయన పదవికే గొడ్డలి పెట్టు అని విమర్శించారు. పోలీసుల తీరుపై ఆగ్రహం: బాధిత కుటుంబం ఎన్ని బెదిరింపులు ఎదురైనా వెనక్కి తగ్గకుండా పోరాడి పోక్సో (గూజూూ) చట్టం కింద కేసు నమోదు చేయించినా, పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేయకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని ఆయన నిలదీశారు. చట్టం చుట్టమైందా?: సామాన్యుడికి ఒక న్యాయం, అధికారంలో ఉన్నోడికి ఒక న్యాయమా? 24 గంటల నిబంధన ఏమైంది?: పోక్సో కేసు నమోదైన 24 గంటల్లో నిందితుడిని అరెస్ట్ చేయాల్సి ఉండగా, పోలీసులు ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గి కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు మేల్కోవాలి! రాష్ట్రంలో ధనవంతుల కోసం, రాజకీయ పలుకుబడి ఉన్నవారి కోసం చట్టాలు చుట్టాలుగా మారుతున్నాయని దీపక్ ఆవేదన వ్యక్తం చేశారు. "బాధిత కుటుంబానికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. బండి భగీరథుని తక్షణమే అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు నిలబెట్టాలి. లేనిపక్షంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని ఆయన హెచ్చరించారు. కేంద్ర మంత్రి కొడుకైనా, సామాన్యుడైనా చట్టం ముందు అందరూ సమానమేనని, బాధితురాలికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఈ సందర్భంగా బంగారు దీపక్ స్పష్టం చేశారు.

# తడిసిన ప్రతి గింజను కొనాలి-జోకిన ధాన్యాన్ని వెంటనే తరలించాలి

-తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి

**చౌటుప్పల్, మే 11, క్రైమ్ మిర్రర్ :** తడిసిన ప్రతి వరి ధాన్యాన్ని కొనాలని, జోకిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి అన్నారు.సోమవారం చౌటుప్పల వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద తడిసిన ధాన్యాన్ని కొనాలని వందలాది మంది రైతులతో ధర్నా కార్యక్రమమును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి నెల రోజులు గడుస్తున్న ధాన్యాన్ని తరలించడానికి అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారని, రైతులను తూకాల పేరుతో, తాలు, పేరుతో రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. రైతులు వందల క్వింటాళ్ల వరి ధాన్యం, ప్రభుత్వం కొంటుందని ఆశతోటి వ్యవసాయం మార్కెట్ యార్డుల్లో పోసి పెడితే, ఆదివారం రోజున అకాల వర్షం తోటి వరి ధాన్యం తడిసి ముద్దయిందని వాపోయారు. తడిసిన ధాన్యాన్ని కొనకుండా అధికారులు రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు మిల్లర్ల సమన్వయంతో దాన్యంను వేగంగా మిల్లులకు తరలించే చర్యలు తీసుకోవాలని అన్నారు.అవసరమైన చోట హమాలీల సంఖ్యను పెంచడంతోపాటు అదనంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు, రైతులు తీసుకువచ్చిన ధాన్యం కల్లాలలో ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా త్వరితగతిన కొనుగోలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం అమ్మిన రైతులకు చెల్లింపులు సకాలంలో



చేయాలని అన్నారు. అకాల వర్షాలు వచ్చే సూచనలు ఉన్న నేపథ్యంలో ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం ఎక్కువగా ఉన్న కేంద్రాలలో వెంటనే లారీలను పంపించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డుల్లో ఉన్నటువంటి ధాన్యాన్ని పది రోజుల్లో తరలించకపోతే రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చీర్క అలివేలు, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, బండారు నరసింహ, రైతు సంఘం నాయకులు ఆకుల ధర్మయ్య, పర్ని ధర్మారెడ్డి, బొడ్డు అంజిరెడ్డి, పొట్ట శ్రీను, బొజ్జ బాలయ్య, జెక్కిడి గోపాల్ రెడ్డి, అంజిరెడ్డి, చీర్క సంజీవరెడ్డి, పడమటి కృష్ణారెడ్డి, లింగయ్య, కృష్ణ, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు

అధికారులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలు

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నకిలీ విత్తనాల నియంత్రణ, ఫార్మర్ రిజిస్ట్రీ, పచ్చి రొట్ట ఎరువుల వినియోగం, నానో యూరియా వినియోగంపై అవగాహన తదితర అంశాలపై వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల నియంత్రణ కోసం మండల, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, జిల్లా స్థాయిలో పోలీస్, వ్యవసాయ శాఖలతో పాటు విత్తన కంపెనీల ప్రతినిధులు కూడా భాగస్వామ్యం కావాలని తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయాలు జరిగినట్లు తేలితే సంబంధిత డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు పోలీస్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. అలాగే అక్రమ నిల్వలు, రవాణా, విక్రయాలపై టాస్క్ ఫోర్స్ బృందాలతో కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా పచ్చి రొట్ట ఎరువుల వినియోగాన్ని పెంచాలని, నానో యూరియా



వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వానాకాలం సాగు సమయానికి రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీ పురోగతిపై క్లస్టర్ వారీగా సమీక్షించిన కలెక్టర్, గోరి కొత్తపల్లి క్లస్టర్‌లో 82 శాతం నమోదు పూర్తి చేసిన ఏఈ సారయ్యను అభినందించారు. జిల్లాలో ఇప్పటివరకు 67 శాతం ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తయిందని పేర్కొంటూ ప్రతిరోజూ పురోగతి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, ఎఎస్పీ నరేష్ కుమార్, మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్, అన్ని మండలాల వ్యవసాయ అధికారులు, క్లస్టర్ ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మున్సిపల్ చైర్ పర్సన్

**చౌటుప్పల్,మే 11, క్రైమ్ మిర్రర్:** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తొమ్మిదవ వార్డులో శ్రీ పేరుమాళ్ల ఆంజనేయస్వామి దేవాలయమునకు వెళ్లే దారిలో జెడ్.పి.హెచ్.ఎస్ సమీపాన నిర్మించ తలపెట్టిన ఆర్చి నిర్మాణ పనులను సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ వారి చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించి ఆర్చి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆర్చి నిర్మాణానికి సహకరిస్తున్న వ్యాపారవేత్త ముత్యాల అశోక్ రెడ్డి సంధ్యారాణి దంపతులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు ముత్యాల భూపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు అన్నమోని చంద్రయ్య, కలకుంట్ల శివకుమార్, పోలోజు రామాచారి, ప్రధాన కార్యదర్శి ఎన్నం బాలరాజు, కోశాధికారి సామిడి రాఘవరెడ్డి, కమిటీ ప్రతినిధులు గజ్జల లక్ష్మణ్ రాజు,సుంకి రవికుమార్,పల్లెం రవి, గుర్రం బాలరాజు, మారగోని మహేష్, చింతల పరమేష్, నల్ల జంగయ్య, పట్టణ ప్రముఖులు దాచేపల్లి ప్రకాష్, ముత్యాల పాపిరెడ్డి, పి శ్రీధర్ బాబు, బొడిగ బాలకృష్ణ,ఎడ్ల మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.



# డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మె నోటీస్

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** మహాదేవపూర్ మండలంలో ఐకేపీ వీఓఏలు తమ వివిధ సమస్యల పరిష్కారానికి నిరవధిక సమ్మె నోటీస్‌ను సోమవారం ఇంచార్జి ఏపీఎం గారికి అందజేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. వీఓఏలకు కనీస వేతనంగా రూ.20,000 ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, అర్హులైన వీఓఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ట్యాబ్ సౌకర్యం కల్పించి 58 జీఓలో సవరణలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వీఓఏ నాయకులు అవినాష్, సృజన్, భారతి తదితర వీఓఏలు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో 82 ఫిర్యాదులు



**సైబరాబాద్ క్రైమ్ మిర్రర్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 82 ఫిర్యాదులు అందాయి. కమిషనర్ సృజన అన్ని విభాగాల అధికారులతో కలిసి ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన 55, ఇంజనీరింగ్ 14, పారిశుధ్యం 6, భూసేకరణ 2, అర్బన్ బయోడైవర్సిటీ 2, యాడ్వర్టైజ్‌మెంట్ 1, రెవెన్యూ 1, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ 1 ఫిర్యాదులు నమోదయ్యాయి. ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక ట్రాకింగ్ ఐడి కేటాయించినట్లు అధికారులు తెలిపారు. అందిన ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో తీసుకుని వివిధ శాఖల సమన్వయంతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిరంతర ఫాలోఅప్ నిర్వహిస్తూ సమస్యల పరిష్కారంపై పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

# ఎలగలగూడెంలో మేడే వేడుకలు

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** మునుగోడు మండల పరిధిలోని ఎలగలగూడెంలో గ్రామ శాఖ ఆధ్వర్యములో 141 వ మేడే ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు..సిపిఐ జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి ఎర్ర జెండా ఎగురవేశారు. తిరుపారి వెంకటేశ్వర్లు, ఈదులకంటి కైలాష్ ,కృష్ణయ్య, నరసింహా, యాదయ్య పాల్గొన్నారు.



# బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు

**మంత్రి పదవికి బండి సంజయ్ రాజీనామా చేయాలి బీఆర్ఎస్ మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు సోలిపురం అరుణ**



**ఆత్మకూరు(ఎం),మే11/క్రైమ్ మిర్రర్:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు సోలిపురం అరుణ డిమాండ్ చేశారు. సోమవారం ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మైనర్ బాలికపై జరిగిన ఘటన అత్యంత దారుణమని పేర్కొన్న ఆమె, నిందితుడిపై చట్టప్రకారం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కేసు విషయంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి వేగవంతమైన దర్యాప్తు చేపట్టాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన పదవిని అడ్డుపెట్టుకుని కేసును ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు .ఇక తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వ్యవహారంలో పూర్తిగా మౌనం పాటిస్తోందని విమర్శించారు. మహిళల భద్రతపై పెద్ద పెద్ద మాటలు చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం, ఇలాంటి తీవ్రమైన ఘటనలో స్పందించకపోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటివరకు కేసుపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడం, నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు పూర్తిగా సరిపోవని, పరోక్షంగా నిందితులకు మద్దతు ఇస్తున్నట్టుగా కనిపిస్తోందని విమర్శించారు. బండి భగీరథ్‌పై కఠిన చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని అరుణ హెచ్చరించారు స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి



**ఆత్మకూరు(ఎం),మే11/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల గ్రామ శాఖ సమావేశం తండ స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ పల్లెర్ల గ్రామంలో గతంలో కొంత మందికి మాత్రమే ఇందిరమ్మ ఇల్లు ఇచ్చారు. ఇంకా అర్హులైన లబ్ధిదారులు నిరుపేదలున్నారు. అదేవిధంగా ఈ ఆత్మకూరు(ఎం) మండలంలో చాలా గ్రామాలలో అర్హులైన వారు ఉన్నారు. వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నారు. వృద్ధాప్యా, వితశీత్తు, వికలాంగుల పెన్షన్ అర్హులైన వారికి ఇవ్వాలన్నారు .ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, మండల కార్యవర్గ సభ్యులు సోలిపురం లింగారెడ్డి, గుర్రం రాజమణి, శాఖ కార్యదర్శి దుర్గాపతి నరసింహ, సహాయ కార్యదర్శి కంబాలపల్లి కిష్టయ్య, వార్డ్ మెంబర్ అంబోజు రాములు, ఏనుగు శ్రీను రెడ్డి, బత్తిని లింగయ్య, బండి గోపాల్, కనబోయిన ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కూనపురి రాములు 12 వ వర్ధంతి



**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని దాసిరెడ్డి గూడెం గ్రామంలో వలిగొండ మార్కెట్ మాజీ చైర్మన్ కూనపురి కవిత ఆధ్వర్యంలో స్వర్గీయ కూనపురి రాములు స్తూపం వద్ద నివాళులు అర్పించి 12 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ సురకంటి వెంకట్ రెడ్డి, సర్పంచ్ రాపోలు గోపి, ఎం తుర్కపల్లి మాజీ ఎంపీటీసీ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షులు డేగల పాండు, మాజీ సర్పంచ్ కొమురెల్లి సంజీవరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎండి అఫ్రోజ్, వార్డ్ నెంబర్ బలుగూరి నరేష్ రెడ్డి, మండల సోషల్ మీడియా అధ్యక్షులు కూచిమల్ల సుధాకర్, పోలేపాక సత్యనారాయణ, ఎండి అజ్జు, పల్లె శ్రీశైలం. కేవైసీ అధ్యక్షులు గుండె వెంకటేష్, ఒట్టే జానయ్య, రాజ్యాధికార పార్టీ మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ, పుట్ట వీరేష్, సురేష్, పనుమటి దామోదర్ అభిమానులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ నగర్ లో బెల్ట్ షాప్ పై రైడ్ చేసిన ఎల్బీనగర్ పోలీసులు

**109 లీటర్ల మద్యం సీజ్, మహిళపై కేసు నమోదు**

**ఎల్బీనగర్ మే 11 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి :** మల్కాజ్గిరి కమిషనరేట్ ఎల్బీనగర్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ మార్కెట్ రోడ్డు పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా నీలం నాగలక్ష్మి అనే మహిళ అక్రమంగా మద్యం అమ్ముతున్న ఇంటిపై ఎల్బీనగర్ పోలీసులు రైడ్ చేసి 109 లీటర్ల మద్యాన్ని సీజ్ చేసినట్టు ఎల్బీనగర్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. నీలం నాగలక్ష్మి ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు ఇన్స్పెక్టర్ తెలిపారు.





# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**-సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి**

**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్లో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల సమితి సమావేశం కామ్రేడ్ పోలేపాక యాదయ్య అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, ధాన్యం కల్లాలకు చేరి రెండు నెలలు అవుతుంది ప్రభుత్వం ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయకపోవడం వలన రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, అకాల వర్షం ఎప్పుడు వస్తదోనని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని అన్నారు. ఆలస్యంగా కొనుగోలు జరుగుతున్నప్పటికీ రైస్ మిల్లర్ల యాజమాన్యం తూకం తక్కువగా వస్తుందని రైతుల నుంచి దాన్యం కటింగ్ చేస్తున్నారని వెంటనే అధికారులు రైస్ మిల్లులను తూనికాల, వేబ్రిడ్జిలను తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, మండల కౌన్సిల్ సభ్యులు ఎలగందుల అంజయ్య, నరిగ యాదయ్య, బోడిగ సుదర్శన్, కట్ల యాదగిరి, పులి పలుకుల మల్లేశం, బత్తుల బిక్షపతి, సుద్దాల సాయికుమార్, మారోజు నరసింహాచారి, కొయ్యకురా రాముల్లు, మచ్చ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని పరిశీలించిన ఉబ్బు వెంకటయ్య

**చౌటుప్పల్, మే 11, క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ మార్కెట్ యార్డ్ లోని ధాన్యం రాశులను సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి తో కలిసి పరిశీలించారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చివరి గింజ వరకు ధాన్యం తూకాలు వేయించే ఏర్పాట్లు చేయిస్తానని రైతులు అధైర్య పడవద్దు అని తెలిపారు. ఇట్టి విషయాన్ని వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి రైతులు తీసుకు వచ్చిన ధాన్యం తూకాలయ్యేవిధంగా తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇట్టి విషయంలో ప్రతిపక్షాలు చేసే అనాలోచిత ఆరోపణలను పట్టించుకోవద్దని రైతులకు సూచించారు.



# పీఎం జిపఉపాలో సమ్మర్ క్యాంప్ ప్రారంభం





**ఆత్మకూరు(ఎం),మే11/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రం లోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మహాదేవ రెడ్డి(ఎంఈఓ) ప్రారంభించడం జరిగినది. సర్పంచ్ బీసు ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు సమ్మర్ క్యాంపు వలన తమ సృజనాత్మకతను పెంపొందించు కోవడానికి ఈ క్యాంపు ఉపయోగపడుతున్నదని అందరూ ఉపయోగించుకోవాలని కోరినారు.ఈ క్యాంపు మే నెలలో 11వ తేదీ నుండి 25 మే వరకు ఉదయం 8:00 గం.ల నుండి మధ్యాహ్నం 12:00 గం.ల వరకు ఉంటుంది.ఈ క్యాంపులో,యోగ, ఆటలు,డ్రాయింగ్,స్పోకెన్ ఇంగ్లీష్,తదితర అంశాలు నేర్చుకోవటానికి వీలుంటుంది అని ప్రతి రోజు విద్యార్థులకు స్నాక్స్ అందించటం జరుగుతున్నది.ఇట్టి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసు కావాలని ప్రధానోపాధ్యాయులు (ఎంఈఓ) కె.మహా దేవ రెడ్డి విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మజ్జిగ నరేష్,వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు మక్సుద్ అలీ, మధు సూదన్ ఇందిరా ప్రియ,ఎస్ఎంసి అధ్యక్షులు మురళి కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.



**ఉపాధి హామీ కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసిన సర్పంచ్ యతీశ్వర్ గౌడ్**

**ఆత్మకూరు(ఎం),మే11/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం రాఘవాపురం గ్రామం సోమవారం రోజున గ్రామంలో ఉపాధిహామీ పనిచేసే ప్రదేశానికి వెళ్లి ఉపాధి హామీ కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసిన సర్పంచ్ ఎరుకల యతీశ్వర్ గౌడ్. అనంతరం వారు ఉపాధి హామీ కార్మికులతో మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ఎండలు ఎక్కువగా ఉన్నందున పనికి ఉదయమే వచ్చి త్వరగా పనులు చేసి త్వరగా వెళ్ళాలని అన్నారు.వడదెబ్బకు ఎవ్వరు గురికాకుండా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ బాకీ పద్మశ్రీ,ఫీల్డ్ అసిస్టెంట్ కొంపల్లి ఇస్తారి,ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

# హత్నూరలో పారిశుద్ధ కార్మికులపై తేనెటీగల దాడి



**ప్రాణాల మీదకు వచ్చిన విధులు..**

**పట్టించుకోని పంచాయతీ కార్యదర్శిపై గ్రామస్తుల ఆగ్రహం**

**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 11:** సోమవారం హత్నూర మండల కేంద్రంలోని వాటర్ ట్యాంకు వద్ద పైపులైన్ లీకేజీ మరమ్మత్తులు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై ఒక్కసారిగా తేనెటీగలు మూకుమ్మడిగా దాడి చేయడంతో తీవ్ర కలకలం రేగింది. విధి నిర్వహణలో నిమగ్నమైన కార్మికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీసిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. తేనెటీగల దాడితో కార్మికులు కేకలు వేస్తూ అక్కడి నుంచి తప్పించుకునేందుకు యత్నించగా, పలువురు తీవ్రంగా గాయపడి అస్వస్థతకు గురయ్యారు. ఘటనను గమనించిన సర్పంచ్ ఎల్లయ్య, స్థానిక నాయకులు, గ్రామస్తులు వెంటనే స్పందించి గాయపడిన కార్మికులను హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. అయితే ఘటన జరిగిన సమయంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మజార్ కనీసం సంఘటన స్థలానికి రాకపోవడం, కార్మికుల పరిస్థితిని పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. “ప్రమాదంలో కార్మికులు ప్రాణాలతో పోరాడుతుంటే అధికారులు ఎక్కడున్నారు?” అంటూ గ్రామస్తులు మండిపడ్డారు. రోజూ ప్రజల కోసం ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల భద్రతపై అధికారుల నిర్లక్ష్యం బయటపడిందని స్థానికులు ఆరోపించారు. వెంటనే కార్మికులకు రక్షణ చర్యలు, భద్రతా పరికరాలు కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# భగీరథ్‌ను అరెస్ట్ చేయాలి

**ప్రభుత్వ నిర్లక్ష్యం, పోలీసుల తీరుపై భగ్గుమన్న బీఆర్ఎస్**

**బండి సంజయ్, భగీరథ్ దిష్టిబొమ్మల దహనం**

**బాధితులకు అండగా ఉంటామని భరోసా**

మైనర్‌పై లైంగికదాడి ఆరోపణల నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదై మూడు రోజులు గడిచినప్పటికీ ఇప్పటివరకు పోలీసు శాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు బాధిత బాలికకు న్యాయం చేయడాన్ని మరిచి బండి భగీరథ్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాధిత బాలికకు మద్దతుగా నేతలు, ప్రజాప్రతినిధులు పెద ఎత్తున పోలీసుల తీరుకు నిరసనగా ర్యాలీలు, రాస్తారోకోలు చేపట్టారు. పలుచోట్ల బండి సంజయ్, బండి భగీరథ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

చిక్కడపల్లి, మే 11: మైనర్‌కు మద్యం తాగించి లైంగికదాడికి పాల్పడ్డాడనే ఆరోపణల నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, రజక వృత్తి దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య, గొర్రెల మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడుతల రవీందర్ , డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ మాట్లాడుతూ.. దేశం కోసం.. ధర్మ కోసం అని అంటూ దేశ ప్రజలను బుకాయిస్తున్న మతోన్మాదులు మహిళల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. సాయి భగీరథను అరెస్టును చేయకపోతే అన్ని సంఘాలను కలుపుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు బాల సుబ్బారావు, సోమయ్య, రమేష్, శంకర్, ఇందిర, రజిత, ఆంజనేయులు, రవి, రాజు, భగత్ పాల్గొన్నారు.

# ఇండ్ల గణన కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలి

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** జన గణన -- 2027 లో భాగంగా తొలి దశ ప్రక్రియ అయిన “ఇండ్ల గణన” కార్యక్రమం జిల్లాలో మే 11 నుండి జూన్ 9 వరకు నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఎన్యుమరేటర్లు ప్రతి గృహానికి వచ్చి కుటుంబ వివరాలను సేకరిస్తారని తెలిపారు. ప్రజలు పూర్తి సరైన సమాచారాన్ని అందించి ఇండ్ల గణన కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఇప్పటికే పొందుతున్న ప్రభుత్వ పథకాలు కోల్పోతామనే అపోహలు అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు తెలియజేసే వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. సేకరించిన సమాచారం భారత దేశ భవిష్యత్ ప్రణాళికలు రూపొందించడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కావున జిల్లా ప్రజలందరూ తమ ఇంటికి వచ్చే



ఎన్యుమరేటర్లకు సరైన సమాచారాన్ని అందించి ఇండ్ల గణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# ఉపాధి హామీ చట్ట రక్షణ కోసం ఈ నెల 15న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ సమ్మెకు సహకరించండి

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం**



**భువనగిరి, మే 11(క్రైమ్ మిర్రర్):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన విబి - జి రాంజీ చట్టాన్ని రద్దుచేసి పాత చట్టాన్ని కొనసాగించాలని, ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మే 15న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ సమ్మె (బంద్) కార్యక్రమానికి సహకరించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డికి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "సమ్మె" నోటీసును సంఘం జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శి బొల్లు యాదగిరి, కొండమడుగు నర్సింహ, జిల్లా ఉపాధ్యక్షులు, చీమల కొండూరు సర్పంచ్ పల్లెర్ల అంజయ్య లు అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ సంపదలో కీలక పాత్ర పోషిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న ఉపాధి హామీ కార్మికులు మోడీ తీసుకొచ్చిన జిరాంజి చట్టం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కొత్త కొత్త జీవోలతో గత చట్టంలో ఉన్న అనేక హక్కులను కూడా తొలగించారని అన్నారు. ఉపాధి కార్మికుల సమస్యలు అన్ని ఇన్ని కావని పనికి పోతే ఎంత కూలి వస్తుందో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నారని, చేసిన పనికి ఎప్పుడు డబ్బులు వస్తాయో కూడా తెలియక తమ కుటుంబాల పోషణ భారంగా మారిందని అన్నారు. ఇప్పటికైనా ఉపాధి హామీలో పనిచేస్తున్న కార్మికులతో పాటు సిబ్బందికి సంబంధించిన పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉపాధి హామీలో పనిచేస్తున్న కార్మికులకు సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి రోజు కూలీ 800 ఇవ్వాలని, రోజుకు రెండుసార్లు ఫోటోలు తీసి ఈ- కేవైసీ విధానాన్ని రద్దుచేయాలని, పని ప్రదేశంలో తాగడానికి మంచి నీళ్లు, నీడ కోసము టెంటు, మెడికల్ కిట్టు లాంటి సౌకర్యాలు కల్పించాలని, విబి - జి రాంజీ చట్టాన్ని రద్దుచేసి , పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, పని ప్రదేశంలో ప్రమాదాలు జరిగితే ఉచిత వైద్యం అందించాలని, కార్మికులందరికి బీమా సౌకర్యం కల్పించాలని, కూలీలకు పారా, తట్ట, గడ్డపార, గొడ్డలి వంటి పనిముట్లు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వము 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వము 40 శాతం నిధులు ఇవ్వాలని తెచ్చిన జీవోలు రద్దుచేసి కేంద్ర ప్రభుత్వమే 90% నిధులు కేటాయించాలని, పట్టణాల్లో కూడా ఉపాధి హామీ పనులను కల్పించి పేదలకు ఉపాధి కల్పించాలనే డిమాండ్స్ సాధన కోసం ఈ నెల 15న నిర్వహిస్తున్న గ్రామీణ సమ్మెలో ఉపాధి హామీ కార్మికులు లక్షలాదిగా పని బంద్ చేసి పాల్గొనాలని వారు కోరారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**యాదాద్రి జిల్లా, మే 11, క్రైమ్ మిర్రర్ :**ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 75 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. సోమవారం ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులలో రెవిన్యూ శాఖ 47,జిల్లా పంచాయతీ 8, పంచాయతీరాజ్ 3, ఎస్సీ డెవలప్మెంట్ 3, గ్రామీణ అభివృద్ధి శాఖ 2, విద్యాశాఖ 2, ఉపాధి కల్పన 2, మున్సిపాలిటీ 2 హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ , సర్వే ల్యాండ్స్, మైన్స్, ఫిషరీస్, వ్యవసాయ ,జిల్లా సంక్షేమ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తూ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని, కొన్ని శాఖలు ఉద్యోగుల వివరాలు అందేజెయలేదని, అట్టి శాఖల ఉద్యోగుల వివరాలను అందజేయాలన్నారు. తదుపరి జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని , ట్యాబ్ ఎంట్రీలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. రైతులకు ఏ ఇబ్బంది కలగకుండా దాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగు నీరు, టెంట్ తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.






# బీజేపీ నేతల కుటుంబాలకు ఒక చట్టం.. సామాన్య ప్రజలకు మరో చట్టమా?

**బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుర్వి యాదయ్య గౌడ్**

**సంస్థాన్ నారాయణపురం, మే 11(క్రైమ్ మిర్రర్):**

మోడీ, రేవంత్ రెడ్డి మౌనం వెనుక అసలు ఒప్పందం ఏమిటి?

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడి పై పోక్సో కేసు నమోదు అయినప్పటికీ ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం రేవంత్ బండి ల మధ్య ఉన్న చీకటి స్నేహానికి నిదర్శనమని అనిపిస్తుంది.

"బేటీ బచావో, బేటీ పడావో" అంటూ దేశానికి నీతులు చెప్పే ప్రధాని నరేంద్రమోడీ ఇప్పుడు తన పార్టీ కీలక నేత కుటుంబానికి సంబంధించిన తీవ్రమైన కేసులో ఎందుకు మౌనం వహిస్తున్నారో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి.

పోక్సో చట్టం కింద కేసు నమోదై 48 గంటలు దాటినా నిందితుడిని అరెస్ట్ చేయకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్నది నిజం కాదా? సామాన్యులు ఇదే నేరం చేస్తే పోలీసులు ఇదే విధంగా వ్యవహరించేవారా?

బీజేపీ నాయకుల పిల్లలకు ప్రత్యేక రక్షణ, సామాన్య ప్రజలకు కఠిన చట్టాలా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి, బండి సంజయ్ ఆప్త మిత్రుడు రేవంత్ రెడ్డి ఈ ఘటనపై నోరు మెదపకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది. తెలంగాణలో మహిళల భద్రతపై గొప్పలు చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు బీజేపీ సమాధానం చెప్పాలి.

# జనగణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో ప్రారంభమైన జనగణన కార్యక్రమాన్ని జోనల్ కమిషనర్ చంద్రకళ మరియు డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ప్రత్యక్షంగా పరిశీలించారు. ఫీల్డ్‌లో ఇంటింటికి వెళ్లి జనగణన విధులు నిర్వహిస్తున్న సూపర్వైజర్లు మరియు ఎన్యుమరేటర్ల పనితీరును పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ, ప్రతి ఇంటికి వెళ్లి ఖచ్చితమైన కుటుంబ వివరాలు సేకరించాలని, ప్రజలకు జనగణన ప్రాముఖ్యతను వివరించాలని అధికారులకు సూచించారు. జనగణన ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.